



ఉగాది వేడుకలకు సిద్ధం

తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలకు జిల్లావాసులు సన్నద్ధమయ్యారు. ఉగాది పర్వదినాన అన్నదాతలు ఏరువాకతో ఖరీఫ్ పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తోంది. రైతులు నాగళ్లను శుభ్రపరిచి.. అరకను సిద్ధం చేశారు. ఉగాదిని పురస్కరించుకుని శనివారం(శ్రీకాకుళం, టెక్కలి, నరసన్నపేట.. తదితర ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఉగాది పచ్చడిలో ఉపయోగించే దినుసులు, పూజాసామగ్రి కొనుగోలు చేశారు. పూలు, కొబ్బరికాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇదిలా ఉండగా ఆచార, సంప్రదాయాలకు నిలయమైన వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవులో ఆదివారం నుంచి శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం కానున్నాయి. 300 ఏళ్లుగా.. ఉగాది నుంచి తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

8లో

రామ కౌండిన్యకు ఉగాది పురస్కారం

● నేడు సీఎం చేతుల మీదుగా ప్రదానం

గార, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గార మండలం శ్రీకూర్మం గ్రామానికి చెందిన శ్రీభాష్యం రామ కౌండిన్యను రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా రామకౌండిన్య మాట్లాడుతూ.. 'ఉగాది పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉంది. 25 ఏళ్లుగా శ్రీకాకుళం నగరానికి చెందిన డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ వద్ద కూచిపూడి నాట్యంలో శిక్షణ పొందుతున్నాను. తల్లిదండ్రులు, నాట్యగురువు శ్రీకాంత్ ప్రోత్సాహంతో ఈ పురస్కారం సాధించాను' అని తెలిపారు.



రామకౌండిన్య



మాట్లాడుతున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టీడీపీ..

తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక

● ప్రజలారా.. జిల్లా అభివృద్ధికి సహకరించండి: మంత్రి అచ్చెన్నాయుడు

● ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

● ఎన్టీఆర్ విగ్రహాలకు పార్టీ శ్రేణుల నివాళి

అరసవల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక టీడీపీ అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. టీడీపీ 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీశ్రేణులంతా శ్రీకాకుళంలో ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ జెండాను ఎగురవేసి.. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఏడురోడ్లజంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ 'దివంగత నేత నందమూరి తారకరామారావు టీడీపీని స్థాపించి.. 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి రాజకీయాల్లోనే రికార్డు సృష్టించారు. పేదల కోసం కిలో రూ.2కే బియ్యం అందించారు. దేశంలో తొలిసారిగా సామాజిక పింఛన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారు. గ్రామీణ పేద విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ విద్యావిధానం ప్రవేశపెట్టారు. పేదల సంక్షేమ ధ్యేయంగా పాలనలో ఎన్నో సంస్కరణలు చేపట్టి.. ఆదర్శంగా నిలిచారు. ఎన్టీఆర్ తెలుగుజాతి ఆత్మగౌరవం. సీఎం చంద్రబాబునాయుడు తెలుగుజాతి ఆత్మవిశ్వాసం. వైసీపీ పాలనతో గాడి తప్పిన రాష్ట్రాన్ని.. దేశంలోనే అగ్రగామిగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబు కలలను నెరవేరుద్దాం. కారకర్తలే పార్టీకి బలం. వారికి, వారి కుటుంబాలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుంది. పార్టీ కోసం నిజాయితీగా పని చేసిన వారికి గుర్తింపు, గౌరవం లభిస్తాయి' అని తెలిపారు.

● 'తలసరి ఆదాయంలో జిల్లా చివరి స్థానంలో ఉంది. ఈ పరిస్థితిని మారుద్దాం. జిల్లా ప్రజలారా దయచేసి సహకరించండి. జిల్లాలో సుమారు 15వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. భోగాపురం, మూలపేట ఎయిర్‌పోర్టులు రానున్నాయి. జిల్లాలో సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులు, నదుల అనుసంధానం పూర్తిచేస్తాం. జిల్లాకు పెద్ద పరిశ్రమను తీసుకువచ్చి వేలాది మందికి (మిగతా 8వ పేజీలో..)

సంక్షోభంలో కొబ్బరిపీచు పరిశ్రమ

కొబ్బరి పీచు పరిశ్రమ అనగానే ఒకప్పుడు ఠక్కున గుర్తుకొచ్చే ప్రాంతం కంచిలి. ఇక్కడి మార్కెట్‌తో పాటు పీచు పరిశ్రమలకు స్థానికంగానే కాకుండా రాష్ట్ర, దేశస్థాయిలో ఎంతో గుర్తింపు ఉండేది. వందలాది మంది కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందేవారు. నిత్యం ఈ ప్రాంతం కళకళలాడేది. ఇదంతా గతం. ప్రస్తుతం కొబ్బరి పీచు పరిశ్రమ దీనస్థితికి చేరింది. చీడ పీడలు, తెగుళ్ల కారణంగా కొబ్బరి కాయల్లో నాణ్యత లోపించింది. కొనేవారు లేకపోవడంతో ఆ ప్రభావం కంచిలి మార్కెట్, పీచు పరిశ్రమలపై తీవ్రంగా పడింది. పీచు పరిశ్రమలు మూతపడ్డాయి. గతంలో 14 పరిశ్రమలు ఉండగా.. ఇప్పుడు 4 మాత్రమే మిగిలాయి. ఇక్కడ పని చేసే కార్మికులు వలస బాటపట్టారు. ప్రభుత్వం విద్యుత్ రాయితీ, సబ్సిడీపై రుణాలు అందిస్తే కొబ్బరి పీచు పరిశ్రమకు పూర్వవైభవం వచ్చే అవకాశం ఉంది.

కత్తివరం వద్ద పీచు పరిశ్రమ ఇలా..



కంచిలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి):

కంచిలి కొబ్బరి పీచు పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పంట దిగుబడి తగ్గడం, ముడి సరుకు ధరలు పెరగడం, నిర్వహణ భారం ఎక్కువకావడం, ప్రభుత్వాల ప్రోత్సాహం లేకపోవడం తదితర కారణాలతో కొబ్బరి పీచు పరిశ్రమ పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమలు ఒక్కొక్కటీ మూతపడుతున్నాయి. నాలుగు దశాబ్దాల కిందట కంచిలితో పాటు పరిసర గ్రామాల్లో సుమారు 14 కొబ్బరి పీచు పరిశ్రమలు ఉండేవి. ఈ పరిశ్రమల్లో ఆయా గ్రామాలకు చెందిన వందలాది మహిళలు, యువకులు పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు. కంచిలిలో తయారయ్యే పీచుకు మంచి గిరాకీ ఉండేది. నాణ్యమైన కొబ్బరి పీచును తయారు చేసి దేశంలోని గుజరాత్, కేరళ, తమిళనాడు, అహ్మదాబాద్ వంటి రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. దీంతో కార్మికులతో ఈ ప్రాంతం నిత్యం కళకళలాడేది. కాలక్రమంలో ఉద్దానంలో ప్రకృతి విలయాలకు కొబ్బరి పంట పూర్తిగా నాశనం కావడం, చీడ పీడలు, తెగుళ్లతో కాయల నాణ్యత, దిగుబడి తగ్గడంతో ఆ ప్రభావం ప్రత్యక్షంగా కొబ్బరి మార్కెట్‌పై, పరోక్షంగా పీచు పరిశ్రమలపై పడింది. మొదట్లో వాటిని ఎలాగో యజమానులు నెట్టుకొచ్చారు. రానురాను నష్టాలు ఎక్కువ కావడంతో భరించలేక పరిశ్రమలను మూసివేశారు. ప్రస్తుతం కేవలం 4 మాత్రమే నడుస్తున్నాయి. ప్రభుత్వాల నుంచి చేయూత లేక, పెరుగుతున్న నిర్వహణ వ్యయాన్ని భరించలేక, యంత్రాల మరమ్మతులకు గురికావడం, అప్పుల పాలవ్వడం వంటి కారణాలతో పరిశ్రమలను మూసివేసినట్లు పలువురు యజమానులు చెబుతున్నారు. గతంలో కొబ్బరి పీచు పరిశ్రమకు అవసరమైన ముడి సరుకు అమలాపురం వంటి ప్రాంతాల్లో ఉచితంగా, లేదా తక్కువ ధరకే లభించేది. ప్రస్తుతం ముడి సరుకును అధిక ధరకు కొనుగోలు చేయాల్సి (మిగతా 8వ పేజీలో..)

● కంచిలిలో మూతపడుతున్న ఫ్యాక్టరీలు
● నిర్వహణ భారం, నష్టాలే కారణం
● గోడౌన్‌లుగా మారుతున్న భవనాలు
● కార్మికులకు కరువైన ఉపాధి
● ఇతర రాష్ట్రాలకు వలస బాట
● ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే మనుగడ



కంచిలిలో చెత్త కొనుగోలు కేంద్రంగా మారిన కొబ్బరి పరిశ్రమ భవనం

ఎస్ఆర్‌పీపురం గ్రామానికి చెందిన పాలిన భీమారావు, పాలిన దివాకర్, అంపురం గ్రామానికి చెందిన మల్లార్పు సోమయ్య, పద్మతుల గ్రామానికి చెందిన మునకాల పురుషోత్తం తదితరులు గుజరాజ్, అహ్మదాబాద్ వంటి రాష్ట్రాలకు వలస వెళ్లారు. వీరంతా ఎటువంటి భద్రతలేని పనుల్లో ఉంటూ కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్నారు. వీరితో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడగా... పీచు పరిశ్రమలు, కొబ్బరి బడ్డీలు మూత పడటంతో గత్యంతరం లేక కుటుంబ పోషణ కోసం వలస వచ్చినట్లు కన్నీటి పర్యంతమయ్యారు. ఇళ్ల వద్ద భార్యాపిల్లలతోపాటు వృద్ధులైన తల్లిదండ్రులను వదిలి ఇలా బతుకీడ్చుతున్నామని వాపోతున్నారు. స్థానికంగా పనులు కల్పిస్తే తమ వెతలు తీరుతాయని చెబుతున్నారు.

తోటలో పేకాట

● నలుగురి అరెస్టు ● ఆ ఐదో వాహనం ఎవరిది?

● సమాచారం లీకైందని ఆరోపణలు

శ్రీకాకుళంక్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం మండలం చల్లపేట సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. పేకాడుతున్న శ్రీకాకుళం నగరానికి చెందిన నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1800 నగదు, 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

ఎస్పీ ఆదేశాలతో..

జిల్లా కేంద్రానికి సమీపంలో గత రెండు రోజుల నుంచి విచ్చలవిడిగా పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి సమాచారం అందింది. దీంతో ఆయన ఆదేశాలతో పోలీసులు పేకాట స్థావరాలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం చల్లపేట సమీపంలోని తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకుని ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. అయితే, దొరికింది నలుగురైతే ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకోవడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఐదో బైక్ ఎవరిది అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పోలీసులు దాడి చేస్తారనే సమాచారం పేకాట నిర్వాహకులకు ముందే అందడంతో అక్కడి నుంచి కొందరు పరారైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దాడికి వెళ్లిన పోలీసులు సైతం ఇదే విషయాన్ని బహిరంగంగా చెబుతున్నారు. దీంతో పేకాట నిర్వాహకుల నెట్‌వర్క్ ఏమిటో అర్థమవుతోంది.

● ఇదిలా ఉండగా, రూరల్ పోలీసుస్టేషన్‌లో కొందరి సిబ్బందికి పేకాటరాయుళ్ల నుంచి మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా పోలీసు బాస్ పేకాటపై ఉక్కుపాదం మోపాలని కృషి చేస్తుంటే, కిందిస్థాయిలో కొంతమంది సిబ్బంది చేతివాటంతో పేకాటరాయుళ్లు తప్పించుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

శాశ్వత లోక్ అదాలత్‌తో ఎన్నో సేవలు

● జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా ప్రజా ప్రయోజక సేవలు ఎన్నో లభిస్తాయని జిల్లా న్యాయాధికారి జునైద్‌అహ్మద్ మౌలానా తెలిపారు. శనివారం స్థానిక న్యాయసేవాధికార సంస్థలో న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా మాట్లాడుతూ.. 'శాశ్వత లోక్ అదాలత్ అందిస్తున్న సేవల్లో రవాణా, టెలిఫోన్, విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్యం, వైద్య, విద్య, గ్రామీణ ఉపాధి పథకాలు ఉన్నాయి. అలాగే ఆర్థిక సంస్థలకు సంబంధించి ప్రజా ప్రయోజన సేవలు కూడా పొందవచ్చు' అని తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణ రాజు, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



తామరాపల్లి వద్ద వరుసగా ఢీకొన్న లారీలు

తామరాపల్లి వద్ద హైవేపై బీభత్సం

● ఐదు లారీలు ఒకదానికొకటి ఢీ..
● తప్పిన పెనుముప్పు

10లో

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

● గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీ
● డెవలప్‌మెంట్ చార్జీల తగ్గింపు
● జూన్ 30వరకు దరఖాస్తుల స్వీకరణ



హిరమండలంలో అదనపులోడు బిల్లు చెల్లించకపోవడంతో కనెక్షన్ తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

హిరమండలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అవసరానికి మించి విద్యుత్ వాడే వినియోగదారులు.. లోడ్ క్రమబద్ధీకరణ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఇందుకోసం ధరావతులపై 50శాతం రాయితీ కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, మండలాలు, పట్టణాల పరిధిలో మూడు కిలోవాట్ల వరకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో 6.90 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు గృహంలో ఉపకరణాల లోడ్ లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్లు తీసుకుంటారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడుతో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీ కింద సుమారు రూ.2,250, దరఖాస్తుకు రూ.200 చొప్పున చెల్లించాలి. ఇదే రెండు వాట్ల లోడ్‌కు డెవలప్‌మెంట్ చార్జీ కింద రూ.4,600 కట్టాలి. ఇదే మాదిరి ఐదు కిలోవాట్ల వరకూ నిర్ణీత రుసుం చెల్లించాలి. కాగా చాలా మంది ఒక కిలోవాట్‌లోడుకు కనెక్షన్ తీసుకుంటున్నారు. తక్కువ లోడు చూపుతూ.. అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గ్రామాల్లో సైతం బహుళ అంతస్తుల నిర్మాణాలు పెరుగు తున్నాయి. చాలా మంది రెండు అంత స్తుల భవనాలు నిర్మించి.. విద్యుత్ కనెక్షన్ మాత్రం ఒక్కటే తీసుకుంటున్నారు. ఏసీలు, కూలర్లు, గ్రీజర్లు వాడుతూ.. వారు తీసుకున్న కిలోవాట్ల పరిమితికి మించి లోడ్ వినియోగిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు దాడుల సమయంలో అదనపు లోడును గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. అపరాధ రుసుము విధిస్తున్నారు. అయినప్పటికీ చాలామంది లోడ్ క్రమబద్ధీకరణకు ముందుకు రావడం లేదు. అవసరానికి మించి విద్యుత్ వినియోగం కారణంగా లోడ్ పెరిగి.. ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ పాడైపోతున్నాయి. ఫ్యూజులు పోతున్నా యి. ఈ నేపథ్యంలో గ్రామాల్లోనూ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేలా.. విద్యుత్ వినియోగం లోడు క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం 50 శాతం రాయితీ కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీనిపై (మిగతా 8వ పేజీలో..)

రాయితీ వర్తింపు ఇలా..

అదనపులోడు (కిలో వాట్లలో)	అసలు ధర(రూ.)	తగ్గింపు ధర(రూ.)
కిలోవాట్	2,250	1,250
రెండు	4,450	2,450
మూడు	6,650	3,650
నాలుగు	8,850	4,850
ఐదు	11,050	6,050



బ్యాంక్ ఖాతా తెరిచి.. రూ.5వేలు ఇచ్చి..

● పలాసలో కొత్త తరహా మాఫియా
● యువతే టార్గెట్‌గా అకౌంట్లు ప్రారంభం
● ఆపై తాయిలాలు అందజేస్తున్న ముఠా
● బెట్టింగ్, అసాంఘిక కార్యక్రమాలకు వినియోగిస్తున్నారనే అనుమానాలు
● ఆరా తీస్తున్న పోలీసులు

పలాస, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ బెట్టింగ్‌ల వేళ.. పలాసలో ఓ మాఫియా కొత్త తరహా ఆగడాలు వెలుగుచూశాయి. ఆ ముఠా సభ్యులు.. చదువుకుంటున్న యువతను టార్గెట్ చేసి.. వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచి.. ఆపై రూ.5వేలు చొప్పున అందజేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగులు, అసాంఘిక కార్యక్రమాలకు ఈ అకౌంట్లు ప్రారంభించి దాని ద్వారా నగదు బదిలీకి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. వివరాల్లోకివెళితే.. సాధారణంగా యువకులు బ్యాంకు ఖాతా ప్రారంభించాలంటే వారి తల్లిదండ్రుల అనుమతి ఉండాలి. లేదా వారు విద్యా రుణం తీసుకోవడానికైనా ఉండాలి. కానీ పలాస-కాశీబుగ్గలో ఇటీవల చదువుతున్న యువకుల బ్యాంక్ ఖాతాలు తెరిచేందుకు ఒక ముఠా తయారైంది. ఆ ముఠాసభ్యులు యువతను మచ్చిక చేసుకున్నారు. వారి నుంచి ఆధార్ కార్డు జిరాక్స్‌లు, పాస్‌ఫొటోలు తీసుకుని వారి పేరిట జీరో బ్యాలెన్స్ బ్యాంక్ అకౌంట్లు ప్రారంభించించారు. ఆపై తాయిలాల కింద రూ.5వేలు ఇస్తున్నారు. యువత ఎందుకని ప్రశ్నించగా.. అది మీకు అనవసరం.. మీకు డబ్బులు ఇస్తున్నామా.. లేదా..! అని బుకాయిస్తున్నారు. యువతతో ఖాతాలు ప్రారంభించి సంబంధిత పుస్తకాలు వారివద్దే ఉంచుకుంటున్నారు. ఉచితంగా రూ.5వేలు వస్తుండడంతో చాలా మంది యువత బ్యాంకు ఖాతాలు తెరిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా.. ఐపీఎల్ క్రికెట్ జరుగుతుండడం, ఆన్‌లైన్ బెట్టింగులు జోరందుకుంటున్న నేపథ్యంలో యువకుల బ్యాంకు ఖాతాల ద్వారా నగదు బదిలీ (మిగతా 9వ పేజీలో..)

విచారణ చేస్తున్నాం



బ్యాంకు ఖాతాలకు సంబంధించిన విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే స్పందించాం. ఇప్పటికే 15మందిని విచారణ చేశాం. ఎందుకు యువకుల బ్యాంకు ఖాతాలు ప్రారంభిస్తున్నారు.. వారు ఎవరనేది పరిశీలిస్తున్నాం. దీనిపై నిఘా పెట్టాం. ఫేక్‌ఖాతాలుగా గుర్తించాం. క్రికెట్ బెట్టింగ్ కోసమే ఈ ఖాతాలు తెరిచినట్టు అనుమానాలు ఉన్న నేపథ్యంలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. వారం రోజుల్లో బ్యాంకు ఖాతాల మిస్టరీ ఛేదిస్తాం.

- వి.వెంకట అప్పారావు, కాశీబుగ్గ డీఎస్పీ



మీరు ఏ తెలుగు సంవత్సరంలో పుట్టారో తెలుసా?

పలాస రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మీరు ఏ సంవత్సరంలో పుట్టారు? అని అడిగితే చాలా మంది ఠక్కున ఆ సంవత్సరం, నెల, తేదీ చెప్పడం సహజం. కానీ ఏ తెలుగు సంవత్సరంలో పుట్టారని అడిగితే తెల్లమొహం వేయడం ఖాయం. ఎందుకంటే మనం పుట్టిన తెలుగు సంవత్సరాది పేరుపై దృష్టి పెట్టం. తెలుగు సంవత్సరాల పేర్లు 60 అన్న సంగతి తెలిసిందే. అలా 1927లో ప్రభవ నామ సంవత్సరంతో మొదలై 1986లో అక్షయ నామ సంవత్సరం వరకూ 60 ఏళ్లు నడిచాయి. మళ్లీ 1987 నుంచి తెలుగు సంవత్సరాలు ప్రారంభమయ్యాయి. 2046లో ఇవి ముగుస్తాయి. 1965లో శ్రీవిశ్వావసు నామ సంవత్సరం వచ్చింది. మళ్లీ 60 ఏళ్లకు అంటే 2025లో ఇప్పుడు అదే సంవత్సరం వచ్చింది. ఈ తెలుగు సంవత్సరాలను సులభంగా నేర్చుకునేందుకు... మనం ఏ సంవత్సరంలో పుట్టామో తెలుసుకునేందుకు గణిత ఉపాధ్యాయుడు మడ్డు తిరుపతిరావు ఓ క్యాలెండర్‌ను రూపొందించారు. 1927 నుంచి 2046 వరకూ సులువుగా వీటిని అర్థం చేసుకునేలా దీన్ని రూపొందించినట్టు ఆయన చెబుతున్నారు. ఈ క్యాలెండర్ ఆకట్టుకుంటోంది.

ఉగాది వేడుకలకు సిద్ధం

- మార్కెట్లు కళకళ
- ఏరువాకకు రైతుల సన్నాహాలు



టెక్కలి: ఏరువాక కోసం సామగ్రి కొనుగోలు చేస్తూ..



టెక్కలి: చెరుకులు కొనుగోలు చేస్తున్న రైతులు

నరసన్నపేట/టెక్కలి/నందిగాం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉగాది వేడుకలకు అన్నదాతలు సిద్ధమయ్యారు. రైతులు కొత్త అమవాస్యగా పిలుచుకునే ఈ పండుగ రోజున శుభ ఘడియల్లో ఏరువూత కార్యక్రమం చేపడతారు. నాగళ్లను శుభ్రపరిచి... అరకను సిద్ధం చేసేందుకు అవసరమైన మోకు, పలుపులతో పాటు ఎద్దులను అలంకరించేందుకు రంగురంగుల తాళ్లు కొత్త కర్ర (మునకల కర్ర) కొనుగోలు చేస్తారు. పొలాల్లో తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్యలో తొలి దుక్కి దున్నుతారు. తరతరాలుగా ఈ సంప్రదాయాన్ని రైతులు కొనసాగిస్తున్నారు. రైతు కుటుంబాలు తమ ఇళ్లలో పిండివంటలు వండు కుంటారు. పురోహితులు ఉగాది రోజున పంచాంగశ్రవణం రైతులకు వినిపించడం ఆనవాయితీ. ఇదిలా ఉండగా... ఉగాది పచ్చడి తయారు చేసేందుకు మామిడి కాయలు, కొత్త చింతపండు, కొత్త బెల్లం, వేపపువ్వు, చెరుకు తదితర వస్తువులను ప్రజలు కొనుగోలు చేశారు. కొనుగోలుదారులతో నరసన్నపేట మార్కెట్ కిటకిటలాడింది.



నందిగాం: మార్కెట్‌లో కూరగాయలు కొంటున్న ప్రజలు

ఆఫర్లు ప్రకటించిన వ్యాపారులు

ఉగాది పర్వదినం రోజున కొత్తవస్తువులు కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందనే నమ్మకం ఉంది. ఈ రోజున పసుపు, బెల్లం, చింతపండుతోపాటు బంగారం, వెండి ఆభరణాలను ఎక్కువగా సంపన్నవర్గాలు కొనుగోలు చేస్తారు. ఈ నేపథ్యంలో బంగారం షాపులు ఆఫర్లు ప్రకటించాయి. గ్రాము బంగారు ఆభరణాల కొనుగోలుపై రూ.50 నుంచి రూ.70 వరకు తగ్గించారు. కొందరు వ్యాపారులు బహుమానాలు ప్రకటించారు. అదేబాటలో సెల్‌షాపులు, ఫర్నీచర్ షాపులు కూడా ఆఫర్లు ప్రకటించాయి.

సంక్షోభంలో కొబ్బరిపీచు పరిశ్రమ

(ఏడో పేజీ తరువాయి)

రావడం కూడా పీచు పరిశ్రమ దివాలాకు కారణమైందని యజమానులు వాపోతున్నారు.

కార్మికులు వలస..

కంచిలి మండలంలోని ఎస్‌ఆర్‌సీ పురం, అంపురం, బురదపాడు, పద్మతుల, గొల్లకంచిలి తదితర గ్రామాల్లో కొబ్బరి కార్మికులు ఉన్నారు. గతంలో స్థానికంగా నిర్వహిస్తున్న కొబ్బరి బడ్డీలు, కొబ్బరి పీచు పరిశ్రమల్లో పనులు చేసుకుంటూ వీరంతా జీవనం సాగించేవారు. ప్రస్తుతం కొబ్బరి పీచు పరిశ్రమలు మూతపడడంతో వాటి భవనాల్లో చాలా వరకు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని భవనాలు చెత్తను విక్రయించే షాపులుగా, గౌడౌన్‌లుగా మారాయి. అలాగే, మార్కెట్ కూడా పూర్తిగా దెబ్బతింది. కార్మికులు స్థానికంగా పనులు లభించక వలస పోతున్నారు. గతంలో ఇక్కడ తయారు చేసిన పీచును ఏ రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారో, ఇప్పుడు అదే రాష్ట్రాలకు వలస కూలీలుగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అనుబంధ సంస్థలను ప్రోత్సహించాలి..


కొబ్బరి కార్మికుల వలసలు నివారించాలంటే మొదటగా ఉద్దానం కొబ్బరి పంట అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సర్వత్రా కోరుతున్నారు. ప్రకృతి విలయాలు, చీడ పీడలు, తెగుళ్ల బారిన పడిన కొబ్బరి పంటకు జవసత్వాలు నింపేలా చర్యలు తీసుకోవాలి. ఆ దిశగా రైతులను చైతన్యపరిచి, వారికి సబ్సిడీపై విత్తనాలు, ఇతర ప్రోత్సాహకాలను అందించాల్సిన అవసరం ఉంది. అలాగే, గిడ్డంగుల సదుపాయం, మార్కెట్ ధరలకు విక్రయించేలా పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఉద్దానం ప్రాంతంలో కొబ్బరి రైతులకు సంబంధించి అనుబంధ పరిశ్రమల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కొబ్బరి దిగుబడులు పెంచడం ద్వారా రైతులకు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో కూలీలకు ఉపాధి లభిస్తుంది. దీంతో ఈ ప్రాంతం నుంచి వలసలు నివారించవచ్చనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. కొబ్బరి అనుబంధ పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు కల్పించడం, సబ్సిడీపై రుణాలు మంజూరు చేయడం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడితే ఉపాధి అవకాశాలు పెంచవచ్చు.

చేయూత అందించాలి..



నిర్వహణ ఖర్చులు పెరగడం, ముడి సరుకుల స్థానికంగా లభించకపోవడంతో పీచు పరిశ్రమ నిర్వహించడం చాలా కష్టంగా ఉంది. పరిశ్రమ నిలదొక్కుకోవాలంటే ప్రభుత్వం చేయూత అందించాలి. సబ్సిడీపై రుణాలు అందించడం, రాయితీపై యంత్రాలు మంజూరు చేయడం చేస్తే పరిశ్రమ అభివృద్ధి చెందడమే కాకుండా పది మందికి ఉపాధి లభిస్తుంది. **- పండి రవి, పీచు పరిశ్రమ నిర్వాహకుడు**

ఊరూరా ఎగిరిన పసుపు జెండా



కోటబొమ్మాళి: పార్టీ జెండాను ఆవిష్కరించిన మంత్రి అచ్చెన్నాయుడు

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి... నివాళులర్పించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కొన్నిచోట్ల నాయకులు, కార్యకర్తలు సైకిల్ ర్యాలీలు నిర్వహించారు.



కవిటిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసిన విప్ అశోక్



నరసన్నపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు



పాతపట్నంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు

తెలుగువాడు ఉన్నంత వరకు టీడీపీ ఉంటుంది..

కోటబొమ్మాళి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగువాడు ఉన్నంత వరకు తెలుగుదేశం పార్టీ సజీవంగా ఉంటుందని, మన ఆత్మగౌరవం కోసం ఇది ఏర్పడిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి నాంది పలికిన మహానుభావుడు ఎన్టీఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు బోయిన రమేష్, బోయిన గోవిందరాజులు, టీడీపీ నాయకులు పూజారి శైలజ, తర్ర రామకృష్ణ, పట్ట సింహాచలం, దేవాది సింహాద్రి, వెలమల కామేశ్వరావు, విజయలక్ష్మి, కల్లి నాగయ్యరెడ్డి, కమ్మకట్టు అప్పలరాజు రెడ్డి, కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నలుగురు సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు.

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచింది ఎన్టీఆర్

నరసన్నపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించిన ఘనత అన్నీ ఎన్టీ రామారావుకే దుక్కుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి అన్నారు. శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం పెంచిన పార్టీ టీడీపీ అన్నారు. కార్యకర్తలకు గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, బెవర రాము, బగ్గు రవి, బగ్గు అప్పారావు, పూతి రమణ, కేఎల్ఎన్ ప్రసాద్, బలగ సుమతి, మెండ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే సామాన్యునికి గుర్తింపు

కవిటి/ఇచ్ఛాపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీతోనే సామాన్యులకు రాజకీయ గుర్తింపు లభించిందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బి.అశోక్ అన్నారు. కవిటిలో శనివారం టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. పాత బస్టాండు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేశారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ టీడీపీతోనే పేదవర్గాలకు న్యాయం చేకూరిందన్నారు. అనంతరం కవిటి నుంచి బైక్‌పై ర్యాలీగా ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఇచ్ఛాపురంలోని పాతబస్టాండు జంక్షన్ వద్ద టీడీపీ స్థూపాన్ని ఎమ్మెల్యే అశోక్ ప్రారంభించి.. జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాజకీయ చైతన్యం..

పాతపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావంతోనే ప్రజలలో రాజకీయ చైతన్యం పెరిగిందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంతో పాటు స్థానిక బస్‌స్టాండ్ కూడలిలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక క్యాంపు కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపకులు దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాల వేసి.. నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి స్థానిక బస్‌స్టాండ్ కూడలి వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కూడలిలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నందమూరి తారకరామావు పాలనలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, మడ్డు రామారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా కార్యాలయంలో....

అరసవల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కలమట వెంకటరమణ, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకువెళ్లి, చంద్రబాబు నాయుడి మార్గనిర్దేశంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రణస్థలంలో ఉత్సాహంగా..

రణస్థలం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కార్యకర్తలతో కలసి సైకిల్‌పై మండల కేంద్రంలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నారవ గ్రామంలో 'బాబుతో నేను' కార్యక్రమం చేపట్టారు. సైకిల్ యాత్ర చేస్తూ పుంగనూరులో పెద్దిరెడ్డి అనుచరుల చేతిలో ఇబ్బందులకు గురైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు రామకృష్ణ, రామసూరి, ఆదినారాయణ, సుందర్‌రావు, రమేష్‌లకు సైకిళ్లు, నూతన వస్త్రాలను బహూకరించారు. గ్రామస్తులతో కలిసి టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు ముప్పిడి సురేష్, డీజీఎం ఆనందరావు, బెండు మల్లేశ్వరరావు, పైడి అప్పలదొర, సుజీలమర్మ, పిసిని జగన్నాథం నాయుడు, గొర్లె లక్ష్మణరావు, సతీష్ వర్మ, మైనర్‌రాజు, కనకారావు, ముక్కు ఆదినారాయణ, దన్నాన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో ఎమ్మెల్యే శంకర్ తదితరుల నివాళి



రణస్థలంలో కార్యకర్తలకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎంపీ కలిశెట్టి

టీడీపీ.. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక

(ఏడో పేజీ తరువాయి)

ఉద్యోగాలు కల్పిస్తాం. జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేయలేకపోతే నేను నిజమైన నాయకుడ్ని కానే కాను. ఎమ్మెల్యే గొండు శంకర్‌కు సహకరిస్తే శ్రీకాకుళం మోడల్ నియోజకవర్గంగా నిలవడం ఖాయం. అందరూ శభాష్ అనేలా జిల్లాను అభివృద్ధి చేస్తాం. మా జీవితాలు టీడీపీకి, చంద్రబాబు కుటుంబానికి అంకితమ'ని మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ.. 'ఒక సామాన్యుడినైన నన్ను ఎమ్మెల్యేను చేసి ఆదరించిన పార్టీ టీడీపీ. నిజాయితీగా పనిచేసిన వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందనడానికి నేనే నిదర్శనం. కార్యకర్తలు, ప్రజల సహకారంతో ఎన్టీఆర్ ఆశయాలను, సీఎం చంద్రబాబు స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయమ'ని తెలిపారు.
- అనంతరం జిల్లావ్యాప్తంగా పార్టీ కోసం నిజాయితీగా పనిచేస్తున్న 12 మందిని మంత్రి అచ్చెన్న సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, చౌదరి బాబ్జీ, మెండ దాసునాయుడు, టీడీపీ అధ్యక్షుడు నగర మాదారపు వెంకటేష్, గొండు జగన్నాథరావు, చిట్టి నాగభూషణరావు, అంధవరపు ప్రసాద్, పైడిశెట్టి జయంతి, పీరుకట్ల విఠల్, మొదలవలస రమేష్, చిట్టి మోహన్, శీర రమణయ్య, పీఎంజె.బాబు, బరాటం గుప్త, ఇప్పిలి తిరుమలరావు, కవ్వాడి సుశీల పాల్గొన్నారు.

విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

(ఏడో పేజీ తరువాయి)

వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. రాయితీ దక్కాలంటే జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

- **జూన్ 30వరకు గడువు**

అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జూన్ 30 వరకూ అవకాశం కల్పించింది. ప్రస్తుతం డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తోంది. కిలో వాట్‌కు రూ.2వేలకు బదులు రూ.వెయ్యి చెల్లిస్తే చాలు. జూన్ 30లోగా ఆన్‌లైన్‌లో లేదా ఉప కేంద్రంలోని అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. గృహ, వాణిజ్య, ఇతర వినియోగదరాలకు దీనిపై అవగాహన కల్పిస్తున్నాం. అదనపులోడు అవసరమైన వారు సంబంధిత రుసుము చెల్లించి సర్వీసు క్రమబద్ధీకరించుకోవాలి.

-జి.శంకరరావు, ట్రాన్స్‌కో ఈఈ, టెక్కలి

నేటి నుంచి నువ్వలరేవులో శ్రీరామ నవమి వేడుకలు

- తొమ్మిది రోజుల పాటు నిర్వహణ
- 300 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయం



ఉత్సవాలకు సిద్ధమైన సీతారామ ఆలయం

వజ్రపుకొత్తూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆచార, సంప్రదాయాలకు అత్యంత ప్రాధాన్యమిచ్చే నువ్వలరేవు గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉగాది నుంచి తొమ్మిది రోజుల పాటు వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. సుమారు 300 ఏళ్లుగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఉగాది రోజున గ్రామ దేవత బృందావతి మాత ఆలయం వద్ద జెండాను ఎగరవేస్తారు. అనంతరం మిగిలిన దేవతలకు మూడు రోజుల పాటు మూడు రోజులు వరుసగా మేళ తాళాలతో వెళ్లి ప్రసాదాలు సమర్పిస్తారు. ఆ తరువాత సింహాచలం వెళ్లి... తమ ఇష్టదైవం వరాహ నరసింహమూర్తిని దర్శించుకుంటారు. ఆ తరువాత వచ్చేనెల 6న గ్రామంలో ఉన్న శ్రీరామాలయం వద్ద జెండాను ఎగురవేసి నవమి వేడుకలకు అంకురార్పణ చేస్తారు. ఉత్సవాల సమయంలో రోజూ గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. మరోవైపు గ్రామ పెద్ద వీధిలో ఏర్పాటు చేసిన వేదికపై రామాయణం నృత్యకావ్యం తొమ్మిది రోజుల పాటు సాగుతుంది. ఉత్సవాల నేపథ్యంలో గ్రామంలో ఇప్పటికే విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఏటా సందడిగా నిర్వహిస్తాం..



ఏటా శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం. 300 ఏళ్లుగా గ్రామంలో ఆచారం కొనసాగుతోంది. గ్రామస్తుల ఆర్థిక సాయంతోనే ఉత్సవాలు నిర్వహిస్తుంటాం.

-మువ్వల పూర్ణచంద్రరావు, సర్పంచ్, నువ్వలరేవు

కలసికట్టుగా ఉత్సవాలు..



నువ్వలరేవు గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాలను కలసికట్టుగా చేస్తాం. అంతా కలసి మొత్తం 13 రోజుల పాటు ఉత్సవాలు సాగుతాయి. ఇప్పటికే ఇతర ప్రాంతాలలో ఉన్న గ్రామస్తులు నువ్వలరేవుకు చేరుకున్నారు.

-వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు, నువ్వలరేవు

ఈ సారైనా కఠిన చర్యలుంటాయా?

- ముక్తింపురం కొండను పరిశీలించిన అధికారులు
- ఇంటెలిజెన్స్ అధికారుల ఆరా
- సీఎంవోకు ఫిర్యాదు?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ముక్తింపురం కొండ ప్రాంతాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన 'మాకెవరు అడ్డువచ్చేది' కథనానికి అధికారులు స్పందించారు. కొండపై అక్రమంగా గ్రావెల్ తవ్వకాలపై ఆంధ్రజ్యోతి సామాజిక బాధ్యతగా కథనాలు ప్రచురించింది. అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. వాటిని సైతం అక్రమార్కులు తొలగించి తమ పనికానిచ్చేస్తున్నారు. వందలాది లోడ్ల గ్రావెల్ తవ్వించి కొండను గుల్ల చేస్తున్నారు. ఈ తరుణంలో మరోసారి ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో మైన్స్, రెవెన్యూ అధికారులు శనివారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్టు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరాతీశారు. దీనిపై ముఖ్యమంత్రి కార్యాయానికి సైతం ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం. గతంలో మాదిరిగా వదిలేస్తారా? లేదా? కఠిన చర్యలు తీసుకుంటారో చూడాలి.



పరిశీలిస్తున్న మైన్స్, రెవెన్యూ సిబ్బంది

కుక్కల దాడిలో జింక మృతి



ఇచ్ఛాపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధి రత్తకన్న గ్రామం కొండ పాంతంలో శుక్రవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందింది. గ్రామస్థుల సమాచారం మేరకు శనివారం డిప్యూటీ రేంజర్ రాము, ఫారెస్ట్ బీట్ అధికారులు మృతి చెందిన జింకను పరిశీలించారు. బెల్లుపడ వెటర్నరీ సిబ్బంది పోస్టుమార్టం నిర్వహించారు.

రేపటి గ్రీవెన్స్ రద్దు

శ్రీకాకుళం క్రైం/ కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 31వ తేదీ సోమవారం నిర్వహించనున్న కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) రద్దు చేస్తున్నట్టు డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

- అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ఎస్పీ గ్రీవెన్స్ కూడా రద్దు చేస్తున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం పౌర హక్కుల పరిరక్షణ, అత్యాచార నిరోధక చట్టంపై ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి జిల్లాస్థాయి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీతో కలెక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించి క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను సభ్యులు పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వ మోహన్ రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ లక్ష్మణరావు, పలాస ఆర్డీవో, డీపీవో సౌజన్య, లీడ్ బ్యాంకు మేనేజర్ కిరణ్, కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్‌పై అనర్హత వేటు

ఇచ్ఛాపురం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్, 7వ వార్డు కౌన్సిలర్ లాభాల స్వర్ణమణిపై అనర్హత వేటు పడింది. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. శనివారం ఛైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన మునిసిపల్ సాధారణ సమావేశం జరిగింది, ఆర్టీఐ, పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని, విధుల నిర్వహణలో విఫలం చెందారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో పురపాలిక చట్టం ప్రకారం ఆమె సభ్యత్వం రద్దు చేస్తూ, అనర్హురాలుగా ప్రకటిస్తూ శనివారం కౌన్సిల్ ఆమోదం కోరారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లతో పాటు వైసీపీ కౌన్సిలర్లు కొందరు ఆమోదం తెలిపారు. ఈ మేరకు వైస్ ఛైర్‌పర్సన్ స్వర్ణమణిపై అనర్హత వేటు వేస్తున్నట్టు ఛైర్‌పర్సన్ రాజలక్ష్మి ప్రకటించారు. దీనిపై స్వర్ణమణి మాట్లాడుతూ.. 'కౌన్సిల్ సమావేశంలో నా అనర్హతకి సంబంధించిన అంశాన్ని టేబుల్ అజెండాగా తీసుకురావడం కుట్రలో భాగమే. నాపై చేసిన అభియోగాలపై సమాధానం చెప్పటానికి కూడా నాకు అవకాశం ఇవ్వకపోవడం దారుణం. ఛైర్‌పర్సన్, అధికారులు కుమ్మక్కై నాపై అనర్హత వేటు వేశారు.' అని ఆరోపించారు.

బొంతలకోడూరు సర్పంచ్‌కు సంజాయిషీ నోటీసు

ఎచ్చెర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): బొంతలకోడూరు సర్పంచ్ పంచిరెడ్డి రాంబాబుకు డీపీవో సంజాయిషీ నోటీసు జారీ చేశారు. పంచాయతీలోని రూ.1.80 లక్షలు దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై జరిగిన విచారణలో వాస్తవమని తేలడంతో ఈ సంజాయిషీ నోటీసు జారీ చేశారు. దీనిపై మీ చెక్ పవర్ ఎందుకు రద్దుచేయకూడదో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, మహిళా సాధికారిత కేంద్రం (మహిళా కేంద్రం)లో అర్హులైన ఆసక్తి గల నిరుద్యోగ మహిళలకు ఉపాధికి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మేనేజర్ పైల విమల శనివారంలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన 18-36 ఏళ్ల లోపు గల మహిళలు అర్హులని చెప్పారు. నాలుగు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామన్నారు. 8978820079, 9330677966 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు



జిల్లా న్యాయాధికారి మౌలానాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనగా ఎన్నికైన అధ్యక్షుడు తంగి శివ ప్రసాద్‌తోపాటు సభ్యులంతా జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానాను శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అదేవిధంగా కోర్టు ఆవరణలో గల న్యాయాధికారులు పి.భాస్కరరావు, ఫణికుమార్, సీహెచ్ వివేకానంద శ్రీనివాస్, హిమబిందు, రాజేంద్ర ప్రసాద్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గం సభ్యులు ఇప్పిలి సీతరాజు, పిట్ట దామోదరరావు, భవనీ ప్రసాద్, త్రిపురాన వర ప్రసాదరావు, కొమ్ము రమణమూర్తి, కొమర శంకరరావు, జి.వనజాక్షితోపాటు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, పూర్వపు బార్ సభ్యులు వాన కృష్ణచంద్, పొన్నాడ రమణారావు, కంచరాన నాగభూషణరావు, కిలారి ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

అధునాతన సాంకేతికతతో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకలింపుచేసుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శనివారం ఏఆర్ సిబ్బందికి పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయుధ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీ శేషాద్రి, ఆర్ఐ, ఆర్ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దళితుడైన యరగడ రాము హత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపి, హంతకులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల ఏజేసీ నేతలు దుర్గాసి గణేష్, తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. పీఎన్ కాలనీ జంక్షన్ వద్ద రాము రోడ్డు దాటుతుండగా టూవీలర్ బైక్ గుద్దడంతో రాము పడిపోయినట్టు సీసీ టీవీ ఫుటేజీలో కనిపిస్తోందన్నారు. అతడి మృతదేహం మాత్రం ఎచ్చెర్ల మండలం జర్జాం రోడ్డు పక్కన తుప్పల్లో దొరికిందని, ప్రమాదం పీఎన్ కాలనీ జంక్షన్‌లో జరిగితే, అక్కడకు అతడి దేహం ఎలా వెళ్లిందనేది ప్రశ్నించారు. రామును ఎవరో హత్య చేసి అక్కడ పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. యరగడ రాజేష్, దూలప .అప్పన్న, గండి రాజు, యరగడ గణేష్, బూర చిన్నారావు, సురా ఎర్రయ్య, అసిరయ్య, దండాసి రాంబాబు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన అవసరమని న్యాయాధికారులు అన్నారు. శనివారం నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కొన్నావీధిలోని ప్రభుత్వ కళాశాల బాలికల హాస్టల్-1లో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కేవీఎల్ హిమబిందు, హాస్టల్-2లో అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్ యుగంధర్, నైరా అగ్రికల్చరల్ కళాశాలలో నాలుగో అదనపు న్యాయాధికారి ఎస్.ఫణికుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ నుంచి కె.అపీసునాయుడు, పి.అంజనీకుమార్, పి.హర్షవర్ధన్, జి.ఇందిరా ప్రసాద్, పీపీ రఘురాం, టి.పద్మజ, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయం ముట్టడి

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వరుస ధర్నాలు, నిరసనలు చేపడుతున్న ఉమ్మడి ఉపాధ్యాయ సంఘం నేతలు శనివారం డీఈవో కార్యాలయం ముట్టడించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ పేరిట ఉపాధ్యాయులకు సస్పెండ్ చేసిన డీఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిబార్‌కు గురైన ఐదుగురు విద్యార్థులు కూడా డీఈవో కార్యాలయం వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఉపాధ్యాయ సంఘ నేతలు చౌదరి రవీంద్ర, ఎం.మదన్‌మోహన్, వి.మురళి, పి.కృష్ణారావు తదతరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విద్యావస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం మార్పులు చేస్తుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల ఎంఈవోలతో సమీక్షించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

1న టెన్త్ సోషల్ పరీక్ష

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఈ నెల 31వ తేదీన జరగాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్ష రంజాన్ పండుగ కారణంగా వచ్చే నెల 1వ తేదీకి వాయిదా వేసినట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని కోరారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి

ఎచ్చెర్ల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కుప్పిలి మోడల్ స్కూల్ కేంద్రంగా నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో అన్యాయంగా డిబార్ అయిన ఐదుగురు విద్యార్థులకు జూన్‌లో సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించి న్యాయం చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. కుప్పిలి గ్రామాన్ని వీరంతా శనివారం సందర్శించి డిబార్ అయిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ అంశంపై సానుకూల స్పందన రాకుంటే జిల్లాకేంద్రంలో వచ్చే నెల 1వ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కార్యచరణ సిద్ధంచేస్తామన్నారు.

రాజారావుకు కళారత్న అవార్డు



రాజారావు

పొందూరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత, సాహితీవేత్త వావిలపల్లి రాజారావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారాల్లో భాగంగా కళారత్న అవార్డును ప్రకటించింది. సాహిత్యరంగంలో రాజారావు చేసిన కృషికి పురస్కారం లభించింది. ఈ అవార్డును ఆదివారం విజయవాడలో అందుకోనున్నారు. ఈయన ప్రస్తుతం జి.సిగడాం మండలం ఆనందపురఅగ్రహారం పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు.

టెన్త్ మూల్యాంకనానికి జాబితా విడుదల

గుజరాతీపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల మొదటి వారంలో జిల్లా నిర్వహించాల్సి పదో తరగతి మూల్యాంకనం సబ్జెక్టుల వారీగా సీనియార్టీ జాబితాను విడుదల చేసినట్టు డీఈవో ఎస్.తిరుమల చైతన్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మినాహాయింపు కోరుకునేవారు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కొబ్బరి చెక్కల వేలంపాట వాయిదా

అరసవల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో వచ్చే నెల 1 నుంచి ఏడాది కాలానికి గాను నిర్వహించిన కొబ్బరి చెక్కల వేలం పాట ముచ్చటగా మూడో సారి కూడా వాయిదా పడింది. శనివారం సాయంత్రం ఆలయ అనివెట్టి మండపంలో ఈవో వై.భద్రాజీ, ఆముదాలవలస గ్రూప్ దేవలయాల ఈవో టి.రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలంలో ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. గతేడాది రూ.17.20 లక్షలు పలుకగా, ఈ ఏడాది రూ.12లక్షలు కూడా దాటడం లేదు. గత రెండుసార్లు కూడా ఇలానే తక్కువ పాట నమోదు కావడంతో వాయిదా వేశారు.

ఘనంగా ఉగాది సంబరాలు

శ్రీకాకుళం కల్చరల్ మార్చి 29(ఆంధ్రజ్యోతి): తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఉగాది కార్యక్రమాలు శనివారం కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తెరవే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో వి.రాజారావు, ముట్నూరు బాలసుబ్రహ్మణ్యం బి.వెంకటరావు తోట గోపాలరావు, రామకృష్ణ దాసిరెడ్డి చిరంజీవి, బసవ జగన్నాధరావు, టి.లింగరాజు, కనుగుల సత్యం, పి.గిరీష్ రెడ్డి, లలిత తదితరులు పాల్గొని కవితలు చదివి వినిపించారు.

ఆర్టీసీ శిక్షణ డ్రైవర్లకు ధ్రువపత్రాలు అందజేత

అరసవల్లి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 19వ బ్యాచ్‌కు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ శనివారం ధ్రువపత్రాలు అందజేశారు. వచ్చే నెల మొదటి వారం 20వ బ్యాచ్‌కు శిక్షణ మొదలవుతుందన్నారు. అర్హత, ఆసక్తి గలవారు 7382922737, 7095040608 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గౌరవం లేని చోట సమావేశాలెందుకు?

టెక్కలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌లో సభ్యులు చేసిన ప్రతిపాదన లకు అధికారులు ఆమోదించడం లేదని, బుట్టదాఖలు చేస్తున్నారని, గౌరవం, విలువ లేని చోట సమా వేశాలెందుకని ఎంపీపీ అట్ల సరోజినమ్మ, జడ్పీటీసీ దువ్వాడ వాణి అన్నారు. శనివారం ఎంపీ డీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు తమకు న్యాయం చేయాలంటూ పోడియం వద్ద బైఠాయించి నినాదాలు చేశారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

రణస్థలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ప్రజాప్రతి నిధులు, అదికారులు పూర్తి స్థాయిలో రాకపోవడంతో తూతూ మంత్రంగానే ముగిసింది.

రైల్వేస్టేషన్లను పరిశీలించిన ఈస్ట్‌కోస్ట్ జీఎం

టెక్కలి/పలాస, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నౌపడా నుంచి గుణుపూర్ వరకు 80.900 కిలో మీటర్ల నిడివి ఉన్న బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం పరిశీలించారు. అలాగే పలాస, నౌపడా, టెక్కలి, పెద్దసాన, తెంబూరు, గంగువాడ, పాతపట్నం, పర్లాకిమిడి, సీతాపురం, హడ్డుబంగి, గుణుపూర్ రైల్వేస్టేషన్లను ప్రత్యేక రైలులో వచ్చి పరిశీలించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

హిరమండలం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తంప గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై టెక్కలి డీఎల్పీవో ఆర్.గోపీబాల శనివారం విచారణ చేపట్టారు. సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారని ఇటీవల గ్రామానికి చెందిన మామిడి చిన్నబాబు, ఉప సర్పంచ్ ఉషారాణి తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు.

బ్యాంక్ ఖాతా తెరిచి.. రూ.5వేలు ఇచ్చి

(ఏడో పేజీ తరువాయి)

చేసుకొని లబ్ధి పొందాలని ముఠా సభ్యులు యోచిస్తున్నట్లు సమాచారం. విశాఖపట్నం కేంద్రంగా ఈ బెట్టింగు వ్యవహారం నడుస్తుండగా అక్కడ మూలాలు కదిపితే పలాస-కాశీబుగ్గ యువకుల బ్యాంకు ఖాతాల వ్యవహారం వెలుగుచూసింది. ఈ ప్రాంతంలో క్రికెట్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, రమ్మీ వంటి యాప్‌ల ద్వారా రూ.లక్షలు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల బ్యాంకు ఖాతాల వ్యవహారం వెలుగు చూడడంతో పోలీసులు దీనిపై దృష్టి సారించారు. ఎంతమంది యువకులు బ్యాంకు ఖాతాలు ప్రారంభించారో ఆరా తీస్తున్నారు. వారి ఖాతాలకు నగదు జమయిందా లేదా అనే విషయం వెలుగు చూడాల్సి ఉంది. అయితే బెట్టింగ్‌తో పాటు అసాంఘిక కార్యక్రమాలకు కూడా బ్యాంకు ఖాతాలు వినియోగించే అవకాశం ఉండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఖాతాలు ప్రారంభించడానికి ఎవరు చర్యలు తీసుకుంటున్నారు? ఆ ఖాతాలు ఎవరివి అనే విషయాలు పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తే మొత్తం వ్యవహారం బయటకు వచ్చే అవకాశం ఉంది.

కె.కరాపాడులో వివాహిత హత్య

● భర్తపైనే అనుమానం


మీనాక్షి (ఫైల్)

కవిటి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత హత్యకు గురైన ఘటన శుక్రవారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆర్.కరాపాడు గ్రామానికి చెందిన కొంతాల దిలీప్, మీనాక్షి(27) భార్యభర్తలు. వీరు ఐదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. దిలీప్ స్థానికంగా ఎలక్ట్రికల్ పనులు చేసుకొని జీవనాన్ని సాగిస్తున్నాడు. వీరికి మూడేళ్ల కుమార్తె ఉంది. మీనాక్షి ప్రస్తుతం ఐదు నెలల గర్భిణి. ఈ క్రమంలో మీనాక్షిని సోంపేటలోని ఓ ఆసుపత్రిలో తనిఖీ కోసం దిలీప్ శుక్రవారం సాయంత్రం బైక్‌పై తీసుకునివెళ్లాడు. తిరిగి సోంపేట నుంచి బయలుదేరేటప్పటికే చీకటిపడింది. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ దాటిన తర్వాత తమపై దాడి జరిగిందని, మీనాక్షి తీవ్రంగా గాయపడిందంటూ దిలీప్ ఊర్లోకి వెళ్లి జరిగిన విషయం గ్రామస్థులకు చెప్పాడు. వారి సాయంతో గాయపడిన మీనాక్షిని సోంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకునివెళ్లగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇదిలావుంటే మీనాక్షి తండ్రి బోడయ్య మాత్రం తన కుమార్తెను దిలీప్ హత్య చేశాడని కవిటి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవివర్మ చెప్పారు. అనుమానితుడు పరారీలో ఉన్నాడని, ఇచ్ఛాపురం సీఐ ఎం.చిన్నంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.

21 కిలోల గంజాయి స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయిని రూపు మాపేందుకు పోలీసుశాఖ పనిచేస్తుందని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకా నంద తెలిపారు. గంజాయితో ఎవరైనా పట్టుబడితే రౌడీషీట్ తెరుస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడారు. స్థానిక రెల్లవీధి సమీపంలో ఉన్న రోటరీ క్లబ్ శ్మశాన వాటికలో శనివారం కొందరు గంజాయి సరఫరా చేస్తున్నట్టు రెండో పట్టణ ఎస్ఐ ఆర్.సంతోష్‌కి సమాచారం వచ్చింది. దీంతో తన సిబ్బందితో దాడులు నిర్వహించగా.. అప్పటికే ఒడిశా నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయించేం దుకు సిద్ధమవుతుండగా ఎస్ఐ సంతోష్ సిబ్బందితో వెళ్లి వారిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన కైలాష్ బెహరా, సంతోష్‌కుమార్ మహంతి ఆ రష్ట్రంలోనే గంజాయి కొని ఆంధ్రలో ఎక్కువ ధరకు విక్రయిస్తుంటారన్నారు. ఈ క్రమంలో శ్రీకాకుళంలోని పాత్రునివలసకు చెందిన గుడియా కాళికి కైలాష్, సంతోష్ 21 కిలోల గంజాయిని విక్రయించారు. ఈ నెల 29న శనివారం కాళి కొనుగోలు చేసిన గంజాయిని విక్రయించేందుకు తనతో పాటు గంజాయి కొనుగోలు చేసి, అమ్మకాలు చేసేవారిని నగరంలోని రోటరీక్లబ్ శ్మశాన వాటిక వద్దకు రమ్మన్నాడు. దీంతో శ్రీకాకుళం నగరంలోని వైష్ణవువీధికి చెందిన బొత్తల చిన్నారావు, జలగడుగుల రాకేష్, మండలవీధికి చెందిన సైలాడ వేణుగోపాల్, కృష్ణాపార్క్ సమీపంలో ఉంటున్న కొత్తపల్లి భీమరాజు, పాత్రునివలసకు చెందిన యడ్ల దిలీప్‌కుమార్, గంగాడ లోకేష్ అక్కడికి చేరుకున్నారు. ఇదే సమయంలో ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేసి వారిని పట్టుకున్నారు. వీరి నుంచి 21 కిలోల గంజాయి, ఐదు సెల్‌ఫోన్లు, రూ.400 స్వాధీనం చేసుకు న్నారు. వీరందరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. అయితే ఈ కేసులో ఒడిశాకు చెందిన మరో వ్యక్తిని పట్టుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. గంజాయితో పట్టుబడిన తొమ్మిది మంది వివిధ కేసులో పాత నేరస్థులేనని డీఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో టూటౌన్ సీఐ పి.ఈశ్వరరావు, ఎస్ఐ సంతోష్, హెచ్‌సీలు సింహాచలం, సత్యనారాయణ, కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సోంపేటలో దొంగతనం

సోంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సోంపేట పట్టణ శివారు దుర్గాగుడి సమీపంలో శనివారం ఉదయం దొంగతనం జరిగింది. ఎస్ఐ లవరాజు తెలిపిన వివరాల మేరకు.. విజయదుర్గ కాలనీలోని రెండు ఇళ్లలో ఉదయం 2 నుంచి 4గంటల సమయంలో దొంగతనం జరిగింది. ఎవరూ లేని సమయంలో ఇంట్లో దూరి దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. ఒక ఇంట్లో రూ.2000, మరో ఇంట్లో రూ.4000 చోరీ జరిగింది. ఘటన స్థలాన్ని పలాస డీఎస్పీ వెంకటప్పారావు పరిశీలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆమదాలవలస, మార్చి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ (శ్రీకాకుళం రోడ్) అండర్‌టన్నెల్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు శనివారం తెలిపారు. శ్రీకాకుళం పట్టణ పరిధి గూనపాలెంకు చెందిన జల్లిన లీలా రమణారావు(49) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకి వచ్చాడని, రాత్రి అయినా ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఫోన్ లోకేషన్ ఆధారంగా ఆమదాలవలస వైపు వచ్చినట్టు గుర్తించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో పరిశీలించగా రమణారావు ట్రాక్‌పై విగతజీవిగా పడి ఉన్నాడు. దీన్ని గుర్తించి జీఆర్‌పీ సిబ్బందికి తెలియజేశారు. దీంతో జీఆర్‌పీ ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించినట్టు గుర్తించినట్టు తెలిపారు. రమణారావు భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సారా తరలిస్తున్న పలువురి అరెస్టు

సోంపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న పలువురిని అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కంచిలి మండలం నువాగడ కాలనీకి చెందిన గురుప్రసాద్ కార్జీని గోకర్ణపురం వెళ్లేరోడ్డులో, బొనమాలి గ్రామం వద్ద ఒడిశాకు చెందిన సుధీర్ ప్రధాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరికి సారా సరఫరా చేస్తున్న జె.నారాయణపురం గ్రామానికి చెందిన కాళ్ల చిరంజీవి, బొనమాలికి చెందిన గణప భీమారావుపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈదాడుల్లో సోంపేట మొబైల్ సీసీ జీవీ రమణ, ఎస్ఐ సుజాత సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు


చికిత్సపొందుతున్న జానకిరావు

వజ్రపుకొత్తూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మండలంలోని కొత్తపేట గ్రామ ముఖద్వారం వద్ద దిమ్మకు జెండా కడుతుండగా ఆ స్తంభం విద్యుత్ వైరుకు తాకడంతో గుంటు జానకిరావు, బడే ధనరాజు విద్యుత్ షాక్‌నకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ధనరాజు స్వల్ప గాయాలతో బయట పడగా గుంటు జానకి రావుకు చేతులు, కడుపుపై గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పూండిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే వెంటనే స్తంభాన్ని తొలగించడంతో పెను ప్రమాదం తప్పిందని మాజీ సర్పంచ్ గోవిందు పాపారావు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గౌతు శిరీష, వెంకన్న చౌదరి ఫోన్‌లో పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ను ఈశ్వరరావు, నాయకులు కర్ని రమణ, సూరాడ మోహనరావు, వసంతస్వామి తదితరులు బాధితులను పరామర్శించారు.

ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.
- ఆంధ్రజ్యోతి బృందం



బూర్జ: బూర్జ, కొల్లివలసలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్


ఎచ్చెర్ల: మండల కేంద్రంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భువనేశ్వరరావు తదితరులు


పలాస: సీనియర్ టీడీపీ నాయకులను సత్కరిస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు


హిరమండలం: నివాళి అర్పిస్తున్న జడ్పీటీసీ పి.బుచ్చిబాబు తదితరులు


హరిపురం: రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన ఆధ్వర్యంలో..


శ్రీకాకుళం: అరసవెల్లిలోని స్వగృహంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి


శ్రీకాకుళం రూరల్: బెందువానిపేటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

‘ఉపాధి’ పనుల్లో రూ.4.33 లక్షల అక్రమాలు

● రూ.3 కోట్ల పనులపై విచారణకు పీడీ ఆదేశం

సంతబొమ్మాళి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.4.33 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు వెల్లడించాయి. శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదికను నిర్వహించారు. మస్టర్లు లేకపోవడం, పనుల కొలతల్లో తేడాలు, చనిపోయిన వారి పేరున మస్టర్లు వేయడం వంటి అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. మేఘవరంలో రూ.40 లక్షలు, సంతబొమ్మాళిలో రూ.17 లక్షలు పనులకు సంబంధించిన మస్టర్లు గల్లంతయ్యాయని డీఆర్పీలు వెల్లడించారు. మస్టర్లు గల్లంతు పై ఏపీవో నర్సింహమూర్తి, ఈసీ ధర్మారావు, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణమూర్తిలపై డ్వామా పీడీ సుధాకరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఉపాధిలో జరిగిన అక్రమాలకు బాధ్యులైన సిబ్బంది నుంచి రూ.10.96 లక్షలు రికవరీతో పాటు మరో రూ.1.07లక్షలు జరిమానా విధించారు. పనులకు సంబంధించిన బోర్డులు ఏర్పాటుతో పాటు, మొక్కలను నాటాలని ఆదేశించారు. అలాగే రూ.3 కోట్ల పనులపై విచారణ చేపట్టాలని ఏపీడీ శైలజను ఆదేశించారు. ఏపీవో నర్సింహమూర్తి, ఈసీ ధర్మారావులతో పాటు ఆరుగురు టెక్ని కల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఉపాధి పనుల తనిఖీకి వస్తున్న సామాజిక తనిఖీ సిబ్బంది కొందరు ఉపాధి సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇటు వంటి విధా నం మంచిది కాదని హెచ్చరించారు. ఉపాధి సిబ్బంది నుం చి డబ్బులు వసూళ్ళు చేస్తున్న సామాజిక తనిఖీ బృందానికి ఎస్ఆర్‌పీ తిరుపతిరావు ముందే పీడీ హెచ్చరించారు.


సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీడీ సుధాకరరావు

మండల సమస్యలపై కేంద్రమంత్రికి వినతి


కేంద్రమంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్.ఎన్.పేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఎల్ఎన్‌పేట మండలం ఏర్పడిన నాటి నుంచి అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు వి.పాండురంగనాథరాజు తదితరులు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఢిల్లీలో ఏవియేషన్ క్లబ్‌లో కలిసి వినతిపత్రం అం దించారు. మండల కేంద్రంలో బస్సు సౌకర్యం లేదని, వంశధార నదికి వచ్చే వరదల వల్ల కోతకు గురై పంటలకు నష్టం వాటిల్లుతోందని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. కరకట్టల నిర్మాణం చేపట్టాలని, గ్రామంలో బంగారమ్మతల్లి గుడికి రోడ్డు నిర్మించాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. మండల కేంద్రంలోని రోటరీ నగర్‌లో కాలువల నిర్మాణం చేపట్టేలా కృషి చేయాలన్నారు. అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

రుణాలతో ఆదాయం సృష్టించేందుకు ప్రణాళిక

నరసన్నపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు ఇచ్చే రుణాల ద్వారా ఆదాయం సృష్టించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించిందని స్త్రీనిధి ఎండీ జి.హరిప్రసాద్ అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవనోపాధి ప్రణాళికపై ఎన్యూమరేటర్ల శిక్షణను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న రుణాలతో వ్యాపారాలు చేసి సంపద సృష్టించాలన్నారు. వచ్చే ఏడాది రూ.5,600 కోట్లు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్య క్రమంలో డీఆర్‌డీఏ పీడీ సూర్యకిరణ్, ఏసీ కొండలరావు, ఏపీఎం అప్పలరామయ్య, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన పాల్గొన్నారు.

నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సంతబొమ్మాళి, మార్చి29(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ విభాగంలో సంతబొమ్మాళి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హర్యానాలో శనివారం జరిగిన పోటీల్లో సంతబొమ్మాళి జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు బి.యువరాజ్, బి.సతీష్, డి.దుర్గ పాల్గొని ప్రతిభ కనబరిచి సెమీఫైనల్‌కు చేరుకున్నట్లు ప్రిన్సి పాల్ ఎం.కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వ్యాయామోపాధ్యాయుడు అశోక్‌లను ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

అంబేడ్కర్ సేవారత్న అవార్డుకు ‘చల్లా’ ఎంపిక

టెక్కలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయసాధన, రాజ్యాంగ రక్షణ కోసం మూడు దశాబ్దా లుగా పోరాడుతున్న సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావును అంబేడ్కర్ సేవా రత్న అవార్డుకు ఎంపిక చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఆదివారం ఈ అవార్డును అందించనున్నారు.

పెరగనున్న నౌపడా-గుణుపూర్ రైలు స్పీడ్

టెక్కలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధి నౌపడా-గుణుపూర్ బ్రాడ్‌గేజ్ మార్గంలో నౌపడా నుంచి గుణుపూర్ వరకు రైలు స్పీడ్‌ను 50 నుంచి 75 కిలోమీటర్లకు పెంచుతూ చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ సందీప్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తు తం ఈ లైన్‌లో గుణుపూర్- విశాఖ, గుణుపూర్-పూరీ, గుణుపూర్-రౌర్కెలా తదితర పాసింజర్ రైళ్లతో పాటు రాజ-రాణి ఎక్స్‌ప్రెస్ వంటి నాలుగు రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి స్పీడ్ ఇకపై పెరగనుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఒకే వేదికపై బగ్గు, కృష్ణదాస్

● పంచాంగ శ్రవణంలో పాల్గొన్న నేతలు


పంచాంగం శ్రవణంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

పోలాకి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర సందర్భంగా ఒకే వేదికపై ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు పంచాంగ శ్రవణంలో పాల్గొన్న సందర్భం మబుగాంలో శనివారం తారసపడింది. గ్రామ పురోహితుడు శృంగారం ధనుంజయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఎదురెదురుగా కూర్చొని ఉగాది విశిష్టతను విన్నారు. ఇరువురి రాశిఫలాలను పురోహితుడు చెప్పారు. పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీలక తీతంగా రైతులు పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు.

● జలుమూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నూతన సంవత్సరం పురస్కరించుకొని శనివారం పెద్దదూగాం గ్రామంలో పంచాంగ శ్రవణం నిర్వహించి నూతన సంవత్సరంలో జరుగబోయే ఫలితాలను పురోహితులు మావుడూరి జగదీష్‌శర్మ వివరించారు. నామ నక్షత్రాలు బట్టి నూతన సంవత్సరంలో ఆదాయ, వ్యయాలను పురోహితులు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజానీకం పాల్గొన్నారు.

రాళ్లపాడు పాఠశాలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు




హెచ్ఎంకు అవార్డు అందిస్తున్న సంస్థ ప్రతినిధి రామకృష్ణరాజు

పోలాకి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లపాడు ప్రాథమిక పాఠశాలకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 118 రసాయన శాస్త్ర మూలకాల పేర్లు, 20 అంకెల వర్గమూలాలు, పైఆర్ స్క్వేర్ విలువతో 100 స్థానాలు చెప్పడం, 360 డిగ్రీల త్రికోణం విలువ చెప్పడం, ఎలక్ట్రానిక్ విన్యాసాలు రాయడం, గణిత సమస్యలు తదితర అంశాలపై విద్యార్థుల నైపుణ్యాలను సంస్థ ప్రతినిధులు పరిశీ లించారు. విద్యార్థులకు ప్రతిభ పరీక్ష చేపట్టి అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో సదరు పాఠశాల హెచ్ఎం బంటుపల్లి ధనంజయ్‌దేవ్‌కు ఈ అవార్డును సంస్థ ప్రతినిధి కె.రామకృష్ణరాజు (విజయనగరం) అందజేశారు.

తామరాపల్లి వద్ద హైవేపై బీభత్సం

● ఐదు లారీలు ఒకదానికొకటి ఢీ

నరసన్నపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జమ్ము జంక్షన్ పై ఓవర్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐదు లారీలు ఒకదానిని మరొకటి ఢీకొన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్ మాత్రమే గాయాలు కాగా.. మిగిలిన డ్రైవర్లు స్వల్పగాయాలతో బయట పడ్డారు. శ్రీకాకుళం నుంచి టెక్కలి వైపు హైవేపై జమ్ము జంక్షన్ పై ఓవర్ దాటే సమయంలో ఈ ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన లారీని హైవే అధికారులు క్రేన్ సాయంతో తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో ఇతర వాహనాలను నిలుపుదల చేసేందుకు చిన్న సూచికలు ఏర్పాటు చేశారు. అదిగమనించకుండా ఒడిశాకు చెందిన ట్యాంకర్ ఉదయం ప్రమాదానికి గురైన లారీని ఢీకొంది. అదే సమయంలో ఒకేసారి వెనుక నుంచిమరో నాలుగు లారీలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈప్రమాదంలో రెండు కంటైనర్లు, ఒక ట్యాంకర్, అరటి గెలలు రవాణా చేస్తున్న లారీలు ఒకదానిపై ఒకటి చేరాయి. అయితే ఈ లారీల్లో క్లీనర్లు లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. డ్రైవర్లు ఉన్న వైపు లారీలు స్వల్పంగా దెబ్బతినడంతో ఇద్దరికి సల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగే సమయంలో నేషనల్ హైవే అధికారులు అక్కడ ఉండి వాహనాలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా నియంత్రణ చేయలేపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనా ప్రాంతానికి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఈ వాహనాల నుంచి ఆయిల్ లీకై హైవే పైకి చేరింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనాలు అదుపు తప్పే అవకాశం ఉంది. ఈఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన ఒక విలేకరి కాలుజారడంతో కాలికి తీవ్ర గాయమైంది.


అంబులెన్స్‌లో క్షతగాత్రులకు చికిత్స


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొంప ముంచిన పొగమంచు

నరసన్నపేట, మార్చి 29(ఆంధ్రజ్యోతి): తామరాపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్, క్లీనర్‌కు గాయాల య్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శనివారం ఉదయం దట్టంగా పొగమంచు కురవడంతో టెక్కలి నుంచి శ్రీకాకుళం వైపు వాహనాలు నెమ్మదిగా వెళుతున్నాయి. అయితే వెనుక నుంచి ఒక లారీ వేగంగా వచ్చి మరో లారీని క్రాస్ చేసే సమయంలో బలంగా ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి డివైడర్ పైనుంచి పక్క రోడ్డుపైకి వెళ్లిపోయింది. అయితే ఆ సమయంలో నరసన్నపేట నుంచి టెక్కలి వైపు ఎటువంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ముందుగా వెళుతున్న లారీని బలంగా ఢీకొనడంతో లారీ డ్రైవర్‌కు కాళ్లకు, క్లీనర్‌కు గాయాలయ్యాయి. వెంటనే వారికి 108లో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఘటన ప్రాంతానికి పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


నుజ్జునుజ్జయిన లారీ ముందుభాగం

న్యూస్ బాక్స్

కొరికాన భవానికి కళారత్న అవార్డు



పాతపట్నం, మార్చి 29(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకురాలు, జనసేన నేత కొరికాన భవానికి రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. ఎల్ఎన్ పేట మండలం మిరియాపల్లికి చెందిన ఈమె చేసిన వివిధ సేవా కార్యక్రమాలను గుర్తించి కళారత్న అవార్డును ప్రకటించారు. ఈమె ఆక్వా కల్చర్‌లో పీజీ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌ను ఏయూలో పూర్తి చేశారు. ఈమె భర్త కొరికాన రవికుమార్ సుడా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు నేతలు అభినందించారు.

ఆశీలు రూ.2.28 లక్షలు

కొత్తూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం కర్లెమ్మ పంచాయతీ ఆశీలు వేలాన్ని శనివారం ఈవోపీఆర్డీ వసంతకుమారి నిర్వహించారు. కూనిబిల్లి అన్నపూర్ణమ్మ రూ.2.28 లక్షలకు దక్కించుకున్నారు. వేలం పాటలో సుమారు 15 మంది పాల్గొన్నారు.

ఇళ్లకు సమీపంలో క్వారీపై ఫిర్యాదు

మెళియాపుట్టి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మర్రిపాడు పంచాయతీ హరినారాయణ కాలనీ సమీపంలో చిప్స్ క్వారీకి బాంబులు పెట్టి రాయి తీస్తున్నందున ఇళ్ల బీటలు వారుతున్నాయని జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ బి.పాపారావుకు జనసేన నాయకుడు దుక్క బాలరాజు ఆధ్వ ర్యంలో వినతిపత్రం అందజేశారు. కొన్నేళ్ల నుంచి క్వారీకి అనుమతులిచ్చారని, అయి తే ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని పేర్కొన్నారు. తక్షణం క్వారీని నిలుపుదల చేయాలని కోరారు. జనసేన నాయ కులు మణికంఠ, శివకృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

మాజీ మంత్రి అప్పలరాజుపై కేసు నమోదు?

పలాస, మార్చి 29(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే మరో 16 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలి సింది. దీనిని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. ఢిల్లీరావు మృతిపై న్యాయం జరగలేదని ఆరో పిస్తూ శుక్రవారం అప్పలరాజు, అనుచరులు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. డీఎస్పీ వి.వెంకట అప్పారావుతో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై పోలీసు శాఖ సీరియస్‌గా పరిగణించి శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తున్నారని పేర్కొంటూ కేసు నమోదు చేసిన ట్లు తెలిసింది. దీనిపై సీఐ పి.సూర్యనారాయణను వివరణ కోరగా చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ఆరా

హరిపురం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జీఆర్‌పురం కేజీబీవీ పాఠశాలలో ఇటీవల విషాహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థినుల పరిస్థితిపై చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు శనివారం ఆరా తీశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వీరన్న, అడ్వైజర్ టి.చందనరావు పాఠశాలను సందర్శించి విద్యార్థినులు, సిబ్బందితో మాట్లాడారు. బాలల హక్కుల ఉల్లంఘనకు పాల్పడకుండా మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. విద్యార్థినులపై పర్యవేక్షణ ఉండాల న్నారు. ప్రత్యేకాధికారి వాసంతి పాల్గొన్నారు.

‘డిలైట్’కు విద్యార్థుల ఎంపిక

టెక్కలి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభ కనబరిచి డిలైట్ సాఫ్ట్‌వేర్ కంపెనీకి ఎంపికయ్యారని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా 2025 విద్యా సంవత్సరంలో సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, సీఎస్ఎం పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆయనతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, టీపీవో డాక్టర్ కుమార్ తదితరులు అభినందించారు.